తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ల ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

## మళ్లీ మొదటికొచ్చిన నెర్రి కాలువ...

# మురుగునీటి సమస్య




సూళ్లూరుపేట, జూన్ 12 ప్రభాతవార్త: నెర్రి కాలువ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. పట్టణంలోని ప్రజల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రత్యేక కాలువలోని మురుగు నీటిని తాత్కాలికంగా సూళ్లూరు చెరువుకు సమీపంలోని ఖాళీ ప్రదేశంలోకి వెళ్లే ఏర్పాటు చేసింది. నెర్రి కాల్వ ప్రవహించే దిగువ ప్రాంత రైతులు, ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేసి వాటంబేడు రోడ్డు మార్గంలో సమీపంగా ఉన్న నెర్రికాలువలకు మట్టి పోసి పూడ్చి వేయడంతో సమస్య నెలకొంది. సుమారు 20 రోజులపాటు నెర్రి కాలవలో మురుగునీరు మొత్తం చిన్న సత్రం నుండి శ్రీ చెంగాలమ్మ దేవస్థానం వెనుకవైపు వరకు నిలిచిపోయింది. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధికారులు, రైతులతో మాట్లాడి తాత్కాలిక పరిష్కారం చూపారు. కాగా అక్కడనుండి అసలు సమస్య మొదలైంది సూళ్లూరు చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతులు ఎమ్మెల్యేని కలిసి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరిగేషన్ అధికారులు తాత్కాలిక ప్రాతిపదికన తీసిన లాకులను మూసివేశారు. ఈ ప్రక్రియ జరిగి సుమారు నాలుగు రోజులు కావొస్తుంది. దీంతో నెర్రి కాలువలో తిరిగి మురిగినీరు యధావిధిగా చేరుకుంది. మురుగునీటి పుణ్యమా అని కాలువ నుంచి దుర్గంధ భరితమైన దుర్వాసన వెలువడుతూ ప్రజలను ఇబ్బందులు చేస్తుంది. అలాగే దోమలు బెడదతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటు సూళ్లూరు రైతులు, మరోవైపు నెర్రి కాలువ దిగువ ప్రాంత రైతులు మధ్య పట్టణ ప్రజలుఇబ్బందులు పడుతున్నారు. నేతలు, అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టకపోతే పరిస్థితి మరింత క్లిష్టతరంగా మారే అవకాశాలు ఉన్నాయి.

# ఇదీ ప్రజాపాలన

**-పాలనలో దాపరికం లేదు -కృష్ణానీళ్ళు తిరుమలకు తీసుకువస్తా -హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ -సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన సభలో సిఎం చంద్రబాబు**







తిరుపతి సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు, ప్రక్కన డిసిఎం పవన్,బిజెపి చీఫ్ మాధవ్, లోకేష్

తిరుపతి,జూన్ 12ప్రభాతవార్త్రప్రతినిధి: నాలుగోసారి సిఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రంలో చీకటి పాలన పోయి ప్రజాపాలన వచ్చిందని టిడిపి జాతీయ అధ్యక్షుడు, సిఎం చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. 2019-24 మధ్య కాలంలో విధ్వంసంతో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ ఇచ్చి బతికించిందని తెలిపారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని ఆయన పేర్కొన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నామని, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు మనప్రాంతం నుండే ఎగుమతి చేసేలా మౌళిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. లక్ష కోట్లతో రాయలసీమ ముఖచిత్రాన్ని కాపాడు కుంటామన్నారు. కృష్ణానీళ్ళను శ్రీశైలం మల్లన్నకు, తిరుపతి వెంకన్నకు చేరుస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు. కల్యాణి డ్యామ్‌కు ఈ ఏడాది నీళ్ల తీసుకొస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని విషయాలు ప్రజలతో పంచుకుంటానని అన్నారు. శుక్రవారం ఉదయం తిరుపతి రూరల్ దామినేడులో జరిగిన రెండేళ్ళ సంక్షేమం, అభివృద్ధి,సుపరిపాలన సదస్సులో సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేశ్, బిజెపి చీఫ్ మాధవ్ పాల్గోని అనేక అంశాలపై ప్రసంగించారు. రాష్ట్రాన్ని గెలిపిద్దాం, ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ప్రజలను కోరామని తెలిపారు. 2024 ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిందని ముఖ్యమంత్రి అన్నారు. 2024లో రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకున్నారని అన్నారు. తన రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలైందన్నారు. రాష్ట్రం, దేశం బాగుండాలని కోరుకునే వ్యక్తి పవన్ అని చంద్రబాబు వెల్లడించారు. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని సిఎం విమర్శించారు. ప్రజా వేదిక కూల్చివేతతో జగన్ అరాచక పాలన మొదలైందన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు.ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 21వ శతాబ్దం ప్రధాని మోదీదే అని సిఎం స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశానికి మోదీ ఆత్మస్థైర్యం ఇచ్చారన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. మోదీ పాలనలో భారత్ ప్రతిష్ఠ పెరిగిందని వెల్లడించారు. పుట్టపర్తిలో ఐదో తరం ఫైటర్‌జెట్ తయారుకాబోతోందన్నారు. తిరుపతిలో బుల్లెట్ ఫ్యాక్టరీ వస్తోందని, రాయలసీమ ఇప్పుడు బంగారుసీమ కాబోతోందన్నారు. వచ్చే నెలలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. జొన్నవాడలో బంగారం వెలికితీస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ, సోలార్, విండ్ పవర్‌పై దృష్టి సారించినట్లు చెప్పారు. మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.రాష్ట్రంలో జరుగుతున్న కుట్రలపైనా అప్రమత్తంగా ఉండాలనిసిఎం హెచ్చరించారు. 2024 ఫలితాలు రాష్ట్ర పునర్నిర్మాణానికి అప్పజెప్పిన బాధ్యతగా భావించామన్నారు. పాలకులుగా కాకుండా సేవకులుగా పని చేస్తున్నామని తెలిపారు. తాము పెత్తందార్లు కాదు, ప్రజలకు సేవకులమనే విషయాన్ని ప్రతి ఒక్క ఎమ్మెల్యే గుర్తుంచుకోవాలన్నారు. మేనిఫెస్టో అమలుపై చర్చించడానికి నాతో పాటు ఎన్డీఏ కూటమిలోని ప్రతీ కార్యకర్తా సిద్ధమేనని వైసిపికి సవాల్ విసిరారు. నా దేశం నా బాధ్యత అనే ఆలోచనతోనే మనం అంతా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వం అనుక్షణం ప్రజల గురించే ఆలోచిస్తుంది. అభివృద్ధికి, సుపరిపాలనకు పునరంకితం అయ్యేలా సంకల్పం తీసుకుందామన్నారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించిన ట్రాక్ రికార్డు ప్రజా ప్రభుత్వానిది విధ్వంసం చేసిన రికార్డు గొడ్డలి పార్టీది అని ముఖ్యమంత్రి దుయ్యబట్టారు. అనంతరం డిసిఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేశ్, బిజెపి చీఫ్ మాధవ్ మాట్లాడుతూ చిన్నప్పుడు టీచర్లు కొట్టారనే కోపంతోనే జగన్ వాళ్లపై కక్షగట్టాడని మద్యం షాపుల వద్ద నిలబెట్టాడని ఎద్దేవా చేశారు. జగన్ తెచ్చిన కంపెనీలు ఆంధ్రా గోల్డ్, ప్రెసిడెంట్ మెడల్, గోల్డ్ మెడల్ అని విమర్శించారు. డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. డీఎస్సీ విషయంలో జగన్ చేస్తున్న ఆరోపణలు అంబేద్కర్ రాజ్యాంగంపైన. ,జగన్ పేరులో ఉన్న జీ అంటే జెన్ జీ కాదు. గొడ్డలి. విధ్వంసమే ఆయన అజెండా అని ఘాటుగా విమర్శించారు. ఈ సదస్సులో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, మంత్రులు,

## కూటమి ప్రభుత్వ విజయాలను..

# ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**- మంత్రి సత్యకుమార్‌యాదవ్**



తిరుపతి, జూన్ 12ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ రెండేళ్ల సుపరి పాలన సందర్భంగా తిరుపతిలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలోని ఓహోటల్‌లో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, పారదర్శక పాలనతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్, రెడ్డి, బిజెపి నేతలు శ్రీధర్‌శెట్టి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, డాక్టర్ శ్రీహరి రావు, నాగేంద్ర, నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన...

# కుళ్ళి, దుర్వాసన వస్తున్న వేల కిలోల మాంసం

**తిరుపతి పి.పి.చావడి మటన్ మార్కెట్ తనిఖీలు**



కుళ్ళిన మాంసాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు



తిరుపతి కార్పొరేషన్, జూన్12 ప్రభాతవార్త: తిరుపతిలో చెన్నై, హైదరాబాద్ నుంచి కుళ్లిన తలకాయ మాంసం దిగుమతి, ప్రముఖ మెస్‌లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో మరోసారి నకిలీ, నిల్వ ఉంచిన మాంసం కలకలం రేపింది. నగరంలోని ప్రముఖ పి.పి. చావడి మటన్ మార్కెట్ వేదికగా పెద్ద ఎత్తున సాగుతున్న కుళ్లిన మాంసం నెట్‌వర్క్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు రట్టు చేశారు. చెన్నై, హైదరాబాద్ మహానగరాల్లో అమ్ముడు పోకుండా మిగిలిపోయిన, పాచిపోయిన మేక, గొర్రె తలలు, కాళ్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి తిరుపతికి తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు 1000 కిలోల (ఒక టన్ను) బరువున్న ఈ పాచిపోయిన, కుళ్లుబట్టి తీవ్ర దుర్వాసన వస్తున్న మాంసాన్ని నగరంలోని పలు హోటళ్లు, మెస్‌లకు సరఫరా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ముఖ్యంగా నగరంలో నిత్యం వందలాది మంది భోజనం చేసే, హాని మెస్, రేవతి మెస్, నాయుడు మెస్, వంటి ప్రముఖ తిండి కేంద్రాలకు ఈ నాసిరకం, ప్రమాదకరమైన తలకాయ మాంసం, పాయా (కాళ్లు) సరఫరా అవుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. చెన్నై, హైదరాబాద్ లింకులు వున్నట్లు, ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మెట్రో నగరాల్లో విక్రయించకుండా నిల్వ ఉంచిన వ్యర్థాలను, గడువు ముగిసిన మాంసాన్ని రసాయనాలు చల్లి తిరుపతి మార్కెట్‌కు తరలిస్తున్నట్లు అధికారులకు పక్కా సమాచారం అందింది. దీనిపై రంగంలోకి దిగిన మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మరియు ఫుడ్ సేఫ్టీ అధికారులు పి.పి. చావడి మార్కెట్‌తో పాటు సదరు హోటళ్ల స్టోరేజ్ రూముల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఫ్రీజర్లలో ఎటువంటి లేబుళ్లు, తయారీ తేదీలు లేకుండా కుళ్లిపోయి, రంగు మారిన స్థితిలో ఉన్న తలలు, కాళ్లను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు ఈ నమూనాలను సేకరించి తదుపరి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులకు భారీ జరిమానాలు విధించడంతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటువంటి కుళ్లిన, బ్యాక్టీరియా (సాల్మోనెల్లా, ఈకోలి) చేరిన మాంసాన్ని తినడం వల్ల తీవ్రమైన ఫుడ్ పాయిజనింగ్, గ్యాస్ట్రోఎంటరైటిస్ వంటి జీర్ణకోశ వ్యాధులు వస్తాయని, ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు.

# ప్రజాస్వామ్యంలో...ప్రజలే సుప్రీం!

**-అధికార గర్వానికి ప్రజలు నేర్పిన గుణపాఠమే 2024 తీర్పు -తిరుపతి బహిరంగ సభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్**



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

తిరుపతి కలెక్టరేట్, జూన్ 12 ప్రభాతవార్త : సరిగ్గా రెండేళ్ల క్రితం 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఒక చారిత్రక తీర్పు ఇచ్చారు. ఆ తీర్పు కేవలం ఒక గెలుపు కాదు... అహంకారంపై సామాన్యుడు సంధించిన ఒక బలమైన సందేశం అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్ల పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం దామినేడులో విజయోత్సవ సభ నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరై మాట్లాడారు. ఒక తిరుగులేని హెచ్చరిక. భయాన్ని, అహంకారాన్ని, అధికారమే అంతా అనే అనాగరిక రాజకీయ సంస్కృతిని ప్రజలు పూర్తిగా తిరస్కరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల కంటే ఎవరూ ఎక్కువ కాదని నిరూపించారు. ఆ నాడు ఓటర్లు ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్ సమాజానికి కొండంత ఆత్మవిశ్వాసాన్ని ఇవ్వడమే కాకుండా, రాబోయే తరాల భవిష్యత్తుకు గట్టి నమ్మకాన్ని కల్పించింది. ప్రజలు మనకిచ్చింది కేవలం అధికారం కాదు, రాష్ట్రాన్ని కాపాడి ప్రగతిపథంలో నడిపించే ఒక గొప్ప బాధ్యత' అని జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు పేర్కొన్నారు. ఈ చారిత్రక విజయానికి కారణమైన ప్రతి ఓటరుకీ, రైతుకు, నాయకుడికి, కార్యకర్తకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం కూటమిలోని ఏ ఒక్క పార్టీదో కాదు, ఇది ప్రజా విజయమని అన్నారు. రెండేళ్ల క్రితం ప్రజలు ఇచ్చింది అధికారం కాదు బాధ్యత అని తెలిపారు. దేశానికి ప్రధాని నరేంద్ర మోదీ గారి దూరదృష్టి, రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం.. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే జనసేన పార్టీ సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి బలమైన పునాది పడినట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం 21 సీట్లకు పరిమితమై జనసేన చేసిన త్యాగానికి ప్రజలు 100 శాతం స్ట్రయిక్ రేట్ తో సమాధానమిచ్చారని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతి వేదికగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ ప్రధాన మంత్రిగా సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వర్తించి నెహ్రూ రికార్డును అధిగమించిన గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి కూటమి ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. పెరిగిన వృద్ధాప్య పింఛన్లు, మహిళలకి ఆర్థిక భరోసా, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకి అండగా అన్నదాత సుఖీభవ, అన్నా క్యాంటీన్లు, విద్యకి ఇస్తున్న ప్రాధాన్యత, యువతకి ఉపాధి అవకాశాలు ఇలా ప్రతి అంశంలో మేము ఇచ్చిన మాట తూచా తప్పకుండా ఆచరణలోపెడుతున్నాం. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం, పండిత్ దీనదయాళ్ ఉపధ్యాయ ప్రతిపాదించిన అంత్యోదయ సిద్ధాంతం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా స్థానిక స్వపరిపాలనకు వేసిన బలమైన ప్రజాస్వామ్య పునాదుల తాలూకు ఆలోచనల సమాహారమే నేటి ప్రధాని శ్రీ మోదీ పాలనాతత్వం అని అన్నారు. అధికారాన్ని కేంద్రీకరించడం ప్రజాస్వామ్యం కాదు. అధికారాన్ని ప్రజల దగ్గరకు తీసుకువెళ్లడమే నిజమైన ప్రజాస్వామ్యం. ఒక ఎమ్మెల్యే నియోజకవర్గంలో 600 మంది స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఉంటారు. తెలుగు రాష్ట్రాలు మరింత బలపడాలంటే ఒక రాష్ట్రం కులాల పరిమితుల్ని దాటాలి. ఇంకో రాష్ట్రం ప్రాంతీయతను దాటాలి. మనమంతా భారతీయత వైపు అడుగులు వేయాలి. గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా పంచాయతీల్లో కనీసం బ్లీచింగ్ కి డబ్బులు లేవు. జెండా పండుగ చేయడానికి డబ్బులు లేవు. రాజ్యాంగం పంచాయతీలకు హోదా ఇచ్చినా, దానికి జీవం పోయాల్సింది మనమే. పంచాయతీల్లో పాలన అవసరాలకు సరిపడినంత ఉండడ లేదు. ప్రతి చిన్న పనికి పంచాయతీలు ఎదురు చూడాలి. ప్రతి సమస్య ఎమ్మెల్యే దగ్గరకే వెళ్లాలి. సర్పంచ్‌గా ఎన్నికైనా అధికారాలు వేరే చోట ఉంటాయి. ఇవన్నీ ఆలోచిస్తే సమస్య కేవలం నిధుల కొరత మాత్రమే కాదని అర్థం అయ్యింది. బాధ్యతలపై స్పష్టత లేకపోడమే అందుకు కారణం. పంచాయతీ బలపడితే ప్రజస్వామ్యం బలపడుతుంది. రాష్ట్ర భవిష్యత్తుని నిర్మించే ప్రక్రియకి ఒక బలమైన నాయకత్వం అవసరం. ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఒక రోజులో పుట్టదు. అది గ్రామ సభల్లో, పంచాయతీల్లోనే రూపుదిద్దుకుంటుంది. పంచాయతీ రాజ్ వ్యవస్థ కేవలం ఒక స్థానిక పరిపాలనా వ్యవస్థ కాదు. 50 శాతం మహిళా రిజర్వేషన్ ద్వారా వేలాది మంది మహిళా నాయకులు స్థానిక సంస్థల ద్వారా ముందుకు వస్తున్నారు. అభివృద్ధికి మొదటి అర్హత స్థిరత్వం. రాష్ట్రంలో గత రెండేళ్లుగా ఏర్పడిన రాజకీయ స్థిరత్వం గ్రామాభివృద్ధికి బలమైన పునాది వేసింది. ఎన్డీఏ నిర్ణయాలతో స్పష్టత వచ్చింది. కేంద్ర, రాష్ట్రల మధ్య సమన్వయం బలపడింది. ఆ స్థిరత్వం ఆధారంగా గ్రామాన్ని పరిపాలనా కేంద్రంగా నిలబెట్టే ప్రయత్నం ప్రారంభించాం. స్వర్ణ పంచాయతీ దిశగా ప్రయాణం ప్రారంభించాం. ప్రతి ఆలోచనా సిద్ధాంతంగా మిగిలిపోకూడదు, ఫలితంగా కనబడాలన్నదే స్వర్ణ పంచాయతీ. ఇందుకు ఒక ఉదాహరణ. తిరుపతి జిల్లా పరిధిలోని శ్రీనివాసపురం పంచాయతీలో స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఆస్తుల వివరాలు శాస్త్రీయంగా నమోదు చేశాం. ఇప్పటి వరకు పంచాయతీ రికార్డులలో కనిపించని ఆస్తులు మొదటిసారి వ్యవస్థల్లో కనిపించాయి. రెండేళ్ల క్రితం ప్రజలు మాకు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇచ్చారు. అది కేవలం అధికార బదిలీ కాదు. నమ్మకం బదిలీ, నమ్మకాన్ని నిలుపుకోవడం మన బాధ్యత ఈ దిశగా పని చేస్తున్నాం. నిధుల కోసం, విధానాల కోసం నేను పోరాడగలను. అధికారాల కోసం పోరాడగలను. నాయకులను కాకుండా సంస్థలను, వ్యక్తులను కాకుండా విలువలను నమ్మాలి. అప్పుడే ప్రజాస్వామ్యం శాశ్వతం అవుతుందని పవన్ కళ్యాణ్ అన్నారు. చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకట మణిప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు పెమ్మసాని చంద్రశేఖర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ రాష్ట్ర విద్య, ఐటి, కమ్యునికేషన్, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ , రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దేవాదాయశాఖ నిబంధనలు తుంగలో తొక్కి...

# వ్యాసాశ్రమ ఆస్తులు అప్పనంగా అమ్మకాలు!

(శ్రీకాళహస్తి-ప్రభాతవార్త)
శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు సమీపంలో వందేళ్ళ క్రితం భక్తి భావంతో ధార్మిక దృవతారగా వెలుగొందిన మలయాళ సద్గురు స్థాపించిన వ్యాసాశ్రమం నేడు అవినీతి ఆరోపణలు, అక్రమాలు, కుటుంబపాలనతో రోడ్డున పడ్డాయి. ఓ వైపు సాక్షాత్తు రాష్ట్రపతికి ఫిర్యాదులు అందగా మరో వైపు పలు ఆరోపణలపై గత 20 సంవత్సరాల్లో ప్రత్యేక విచారణలు, సాక్షాత్తు జిల్లా కలెక్టర్ పరిశీలనలు ఆశ్రమంలో చోటు చేసుకున్నాయి. భక్తులు భక్తి భావంతో ఆశ్రమానికి అందించిన ఆస్తులను దేవాదాయశాఖ నిబంధనలను తుంగలో తొక్కి తమ ఇష్టారాజ్యంగా అమ్ముకున్నారనే ఆరోపణలు,విమర్శలు నేడు పీఠాధిపతి మూట కట్టుకున్నారు. ఆగస్టులో వందేళ్ళ పండగను జరుపుకోనున్న ఆశ్రమంలో పాదర్శకత ఎంతో అవసరం.భక్తుల భాగస్వామ్యం అవసరం. ఈ దిశగా తప్పిదాలను పీఠాధిపతి సరిదిద్దాల్సి ఉంది. ధార్మిక క్షేత్రంలోకి జనాన్ని అనుమతించాల్సి ఉంది.

**ఆశ్రమాలు ఆధ్యాత్మిక నిలయాలు:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడులో వ్యాసాశ్రమం, వ్యవస్థాపకులు మలయాళ సద్గురు వద్ద శిష్యరికం పొందిన విద్యాప్రకాశానందగిరి స్వామి శ్రీకాళహస్తిలో శుకబ్రహ్మాశ్రమం, మరో శిష్యుడు బండారుపల్లి గ్రామంలో శ్రీకృష్ణాశ్రమంను స్థాపించారు. మిగిలిన రెండు ఆశ్రమాలు సమర్థవంతంగా భక్తుల సేవలో తరలిస్తూ,ధార్మిక కార్యక్రమాలకు పెద్దపీట వేస్తుండగా వ్యాసాశ్రమంలో కుటుంబపాలనతో గందరగోళంగా మారింది. సొంత నిర్వహణ కమిటీలో పీఠాధిపతి బందులు ప్రమేయంతో పరిపాలన రోడ్డుకెక్కింది. విచారణలకు నిలయంగా మారింది.

**దేవాదాయశాఖ నిబంధనలకు తుంగలో తొక్కి...**

ఏర్పేడు వ్యాసాశ్రమంలో దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న ఆస్తుల్ని వారి నిబంధనలకు తుంగలో తొక్కి విక్రయించుకున్నారనే ఆరోపణలు రాష్ట్ర పతికి అందాయి. ఆమందూరు లోభక్తుల క్వార్టర్స్‌ను పీఠాధిపతి వారసత్వం ఆస్తిగా భావించి తన తమ్ముడు శివరాం బ్రహ్మాచారి పేరుతో శ్రీకాళహస్తి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 2022 జూలై 25 రిజిస్టర్ చేయించి అమ్మకానికి పెట్టడం తరువాత శివరాం బ్రహ్మాచారి ఆ ఆస్తిని గుర్రం మమతకు విక్రయించారు. ఇది దేవాదాయశాఖ నిబంధనలకు విరుద్ధం.ఇక ఏర్పేడు మండలంలోని సర్వేనెంబర్ 69/6లో నిబంధనలకు విరుద్ధంగా ఆశ్రమ కోశాధికారికి విక్రయించినట్లు(2008) సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డు అయ్యి ఉంది.అలాగే తూర్పు గోదావరి జిల్లా తాళ్ళరేవు మండలం సుంకరపాళెం గ్రామంలో ఆశ్రమానికి సంబంధించిన సర్వే నెంబర్ 101/8ఏలో 0.42 ఎకరాలు భూమిని ఎం.వెంకటరెడ్డినాయుడుకు విక్రయించినట్లు మరో వివాదం. చిత్తూరు పట్టణానికి సంబందించిన సర్వే నెంబర్ 479/1లో గల పరాశర్యప్రింటింగ్ ప్రెస్‌ను ఇ .వనితఅనే వ్యక్తికి 2024లో విక్రయించినట్లు సమాచారం ఇది చట్ట విరుద్ధమనే ఆరోపణలున్నాయి. మరి కొంత ఆర్‌లోకనాథంకు అప్పగించినట్లు సమాచారం. ఇవే కాకుండా ఆశ్రమంలో ఆర్థిక వ్యవహారాలు చూపే జమా ఖర్చులు వ్రాసే వ్యవస్తే లేదని ఫిర్యాదులున్నాయి.
(రేపటి సంచికలో విచారణలు ఏ మయ్యాయి?)

## గణనాధుడిని దర్శించుకున్న మంత్రి అచ్చెన్నాయుడు



కాణిపాకం, జూన్ 12 ప్రభాత వార్త: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఇఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొన్నారు. వారికి వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు, స్వామి వారి చిత్రపటంను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎఇఓ రవీంద్రబాబు, సూపరిటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీనాయుడు, స్థానిక తెలుగుదేశం నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## అత్యంత పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియ : కలెక్టర్



చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంను పారదర్శకంగా, ఎలాంటి పొరబాట్లు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జడ్పీ సమావేశ భవనంలో శుక్రవారం చిత్తూరు, పూతలపట్టు, జిడినెల్లూరు నియోజక వర్గాలతో పాటు పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల బూత్ లెవల్ అధికారుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధిగా హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ క్షేత్ర స్థాయి సర్వేపై రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి సారిస్తున్న పరిస్థితుల్లో బిఎల్ఓలు పూర్తి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. 2025 ఓటర్ల జాబితాలను 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలని, వలస వచ్చిన వారు, తాత్కాలిక నివాసంలో వున్న వారి వివరాలను వారి స్వస్థల ఓటర్ల జాబితాలోని తండ్రి, తాతల పేర్లతో సరిపోల్చి పరిశీలించాలన్నారు. అలాగే మృతి చెందిన వారి ఓట్లు, డూప్లికేట్ ఓట్లు, శాశ్వతంగా వలస వెళ్ళిన వారి ఓట్లను గుర్తించి తగిన ఆధారాలు, పత్రాలతో నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. జూన్ 15 నుండి జులై 15 వరకు నిర్వహించే డోర్ టు డోర్ వెరిఫికేషన్ కార్యక్రమంను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మోహన్‌కుమార్, ఆర్డీఓ శ్రీనివాసులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయకుండా వెన్నుపోటు

**– చిత్తూరులో ఎంసి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో వైకాపా ధర్నా**



చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం గత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేకుండా వెన్నుపోటు పొడిచిందని చిత్తూరు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త ఎంసి విజయానందరెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర వైకాపా అధిష్ఠానం నిర్ణయం మేరకు చిత్తూరులో శుక్రవారం ఎంసి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు వెన్నుపోటుకు రెండేళ్ళు కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో గంగినేని చెరువు నుండి గాంధీ విగ్రహం వరకు వైకాపా నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శనగా వచ్చారు. అనంతరం గాంధీ విగ్రహం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎంసి విజయానందరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు పలు హామీలు ఇచ్చిందని, అధికారం చేపట్టి రెండేళ్ళు పూర్తయినా ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని ధ్వజమెత్తారు. రెండేళ్ళుగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, అలాగే అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు ఆ మాటే ఎత్తడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, వైకాపా మహిళా నాయకులు గాయత్రిదేవి, హరిణిరెడ్డి, మాజీ కార్పొరేటర్ కెపి శ్రీధర్, అంజలిరెడ్డి, హరీష్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడి

**– జిల్లా వ్యవసాయ అధికారి మురళీ**



పెనుమూరు, జూన్ 12 ప్రభాతవార్త: సేంద్రీయ ఎరువులు వినియోగించడం ద్వారా పంటల సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి మురళీ అన్నారు. మండల పరిధిలోని పులికల్లు రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్(నేల తల్లిని సంరక్షిద్దాం) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధిగా హాజరైన వ్యవసాయశాఖ జెడి మురళీ మాట్లాడుతూ విష రసాయనాలు తగ్గించి సేంద్రీయ ఎరువులు అందించి నేలతల్లి ఆరోగ్యంను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కొన్ని దశాబ్దాలుగా రసాయనిక ఎరువులు, మందులు వేసి భూసారం, భూ ఆరోగ్యం బాగా దెబ్బతిన్నదన్నారు. ఫలితంగా పంటల దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి సువర్ణలత, శాస్త్రవేత్తలు సుధాకర్, అనిల్‌కుమార్, ఉద్యానశాఖ అధికారి లక్ష్మీ ప్రసన్న, ఆత్మ బిటిఎం నాగేంద్ర, రాస్ చంద్రబాబు, పులిగుంటేశ్వర ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల సంఘం అభ్యక్షులు కవి పసపల హరికృష్ణారెడ్డి, అభ్యుదయ రైతు పూర్ణ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 15న పులిగుండు వద్ద యోగాంధ్ర

పెనుమూరు, జూన్ 12 ప్రభాతవార్త: పెనుమూరు సమీపంలోని పులిగుండు వద్ద ఈ నెల 15వ తేదీ సోమవారం జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు ఎంపిడిఓ నీలకంఠేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జిల్లా అధికారులు అందరు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

## సిఎంను కలిసిన ఎపి రైతు సంఘం నాయకులు

చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త: జిల్లాలో మామిడి రైతుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం తిరుపతి వచ్చిన సిఎం చంద్రబాబు నాయుడును ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మునీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే ఎపి రైతు సంఘ నాయకులు తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సైతం కలిసి మామిడి రైతుల సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు హేమలత, బెల్లంకొండ శ్రీనివాసులు, చెంగల్‌రాయరెడ్డి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## రీ-సర్వేపై రైతులకు అవగాహన



బంగారుపాళ్యం, జూన్ 12 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భూముల రీ-సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర సర్వే, సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ అధికారి కూర్మనాథ్ సూచించారు. శుక్రవారం మొగిలి వెంకటగిరి రెవెన్యూ పరిధిలో జరుగుతున్న రీ-సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు రీ-సర్వేపై రెవెన్యూ సిబ్బంది అవగాహన కల్పించిన అనంతరం సర్వే చేయాలని చెప్పారు. రైతులకు ముందస్తుగా సర్వేపై సమాచారం తప్పక అందించాలని, అలాగే రైతుకు సంబంధించిన భూమికి చుట్టు ప్రక్కల వున్న పట్టాదారులకు సర్వేపై నోటీసులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి పుల్లయ్య, సర్వే ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు, డిప్యూటీ సర్వే ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ లావణ్య, విఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం



కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త: కుప్పంఏరియా హాస్పిటల్‌లో ఓ మహిళ కు విజయవంతంగా మోకాలి మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆసుపత్రి మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ విజయ కుమారి తెలిపారు. కుప్పం మండలం పెద్దబంగారునత్తం గ్రామానికి చెందిన సాలమ్మ(55) చాలా కాలంగా మోకాలి నొప్పితో బాధపడుతూ కుప్పం ఏరియా హాస్పిటల్ లో ఆర్థోపెడిక్స్ డాక్టర్ క్రాంతి కుమార్‌ని సంప్రదించినట్టు తెలిపారు. ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి మోకాలు మార్పిడి అవసరమని గుర్తించినట్టు తెలిపారు. ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ క్రాంతికుమార్ మోకాలు మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. వీల్ చైర్ లో వచ్చిన రోగి నడుచుకుని ఇంటికి వెళ్లడం చాలా సంతోషం అని కుటుంబ సభ్యులు వైద్యులకు, ఆస్పత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధి కోసం ఆరాట పడండి: ద్వాజారెడ్డి



రైల్వేకోడూరు రూరల్, జూన్ 12(ప్రభాతవార్త: రైల్వే కోడూరు మండలంలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజాసేవకు కట్టుబడి ఉండాలని రైల్వేకోడూరు వైసీపీ సీనియర్ నాయకులు ఉప మండల అధ్యక్షుడు రామిరెడ్డి ద్వాజారెడ్డి అన్నారు. శుక్రవారం ఆకస్మికంగా పడిన వర్షానికి గ్రామీణ ప్రాంతాలలో విష జ్వరాలు మురికి గుంతలు ఉంటాయని దోమలను మొదటిలోనే అణచివేయాలని ఆయన ప్రజా ప్రతినిధులకు సూచించారు. ముఖ్యంగా రైల్వే కోదూరు మండలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు పెండింగ్లో ఉన్న పనులను తమ దృష్టికి తెస్తే వేగవంతంగా పూర్తి చేసేందుకు సహకారం అందిస్తానని అన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలకు వీధిలైట్లు సిమెంట్ రోడ్లు తదితర మౌలిక అంశాలపై ప్రతి ఒక్క సర్పంచితో చర్చించి పెండింగ్లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేస్తానని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.వీరమణ, గోపి,దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు, మహేశ్వర్ రెడ్డి, బత్తిన ఆనంద్, అనంతరాజుపేట మైనార్టీ నాయకులు షేక్ షఫీ, బత్తలమని, ప్రసాద్, కె.ఎస్.ఆర్‌తో పాటు గ్రామీణ ప్రాంతాలకు చెందిన సర్పంచులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి మంత్రి లోకేష్ కృషి



రామకుప్పం, జూన్ 12 ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థిని, విద్యార్థులు మంచి చదువులు అభ్యసించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని టిడిపి యువత ప్రధాన కార్యదర్శి వెంకటాచలం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఆవుల కుప్పం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, విద్యా కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ నాగరాజు నాయుడు, బాలాజీ, భాస్కర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గోవింద దీక్ష మాల ధారణ ఊరూరా తెలియజేస్తాం



రామకుప్పం,జూన్ 12 ప్రభాతవార్త: మండలంలో గోవింద దీక్ష మాలలను ఊరూరా తెలియజేస్తామని కమిటీ ఇన్చార్జ్ రవి నాయక్ తెలిపారు. శుక్రవారం వీర్న మలలో గోవింద దీక్ష మాలధారణ ధరించి కమిటీ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గోవింద దీక్ష స్వాములను వైకుంత ఏకాదశి, ద్వాదశి రోజుల్లో దర్శనం కొరకు టీటీడీ దేవస్థానం, అధికారులతో సంప్రదించి దర్శనాలకు ఏర్పాటు చేస్తామన్నారు. 2026 28 సంవత్సరానికి గాను కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాగరాజు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విజయోత్సవ సభకు వి.కోట టీడీపీ శ్రేణులు



వి.కోట, జూన్ 12 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం తిరుపతిలో నిర్వహించిన విజయోత్సవ సభకు వి.కోట మండలం నుంచి టీడీపీ నేతలు,కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు బి.ఆర్. రాంబాబు,రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్ ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు బయలుదేరారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల నుంచి ప్రత్యేక వాహనాల్లో కార్యకర్తలు తిరుపతికి చేరుకున్నారు.

## యోగాపై అవగాహన కార్యక్రమం



బైరెడ్డిపల్లి ,జూన్ 12 ప్రభాతవార్త: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బైరెడ్డిపల్లి 1 అంగన్ వాడీ సెంటర్ నందు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సావిత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగా, ధ్యానం చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని ప్రతి ఒక్కరూ చిన్న వయస్సు నుండి అలవర్చుకోవాలని తెలిపారు చక్కటి జీవనశైలిని పాటిస్తే బీపీ, షుగర్, థైరాయిడ్ అధిక బరువు వంటి జీవనశైలి జబ్బులు తగ్గుతాయని కాబట్టి ప్రతిరోజు కనీసం 30 నిమిషములు నడక,వ్యాయామం యోగ, ధ్యానంచేయడం వలన ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ నిర్మలమ్మ, దీప, ఆశాలు ముబీన భారతి రాజేశ్వరి పాల్గొన్నారు.

## మద్యం స్వాధీనం...వ్యక్తి అరెస్ట్



కుప్పం,జూన్ 12 ప్రభాతవార్త: కుప్పం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం తనిఖీలు చేపట్టగా అక్రమంగా తమిళనాడు మద్యం ను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజ తెలిపారు. గుడిపల్లి మండలం ఓఎన్ కొత్తూరు గ్రామం వద్ద కృష్ణప్ప అనే వ్యక్తి తమిళనాడు రాష్ట్రానికి చెందిన మద్యం ను విక్రయిస్తుండగా అతన్ని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. కృష్ణప్ప నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కుప్పం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది ఇప్పటివరకు 44 మద్యం కేసులు నమోదుచేసి 45 మందిని అరెస్టు చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై మోహన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## మండలానికి 1410 క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలు

శాంతిపురం, జూన్ 12 ప్రభాతవార్త: వ్యవసాయ శాఖ ద్వారా ఖరీఫ్ సీజన్ లో రైతులు సాగు చేసేందుకుగాను 1410 క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలను ప్రభుత్వం ఏపీ సీడ్స్ ద్వారా మండలానికి సరఫరా చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారి పద్మజ తెలిపారు. వేరుశనగ బస్తా (30 కిలోలు) పూర్తి ధర రు.3060 రూపాయలు కాగా రైతు వాటా కింద రూ.1836 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సీజన్ లో రైతులు ప్రత్యామ్నాయ పంటగా సోయాబీన్ సాగు సైతం చేసుకోవచ్చన్నారు.

## యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి : కలెక్టర్



కాణిపాకం, జూన్ 12 ప్రభాతవార్త: శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకగ్రాత కోసం ప్రతి ఒక్కరు యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ప్రాంగణంలో యోగా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి యోగా కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం యోగా శిక్షకుడు శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో సుమారు గంట పాటు నిర్వహించిన యోగా కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌లు, పలువురు అధికారులు యోగా అభ్యాసకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా జీవితాంతం ఆచరించే ఆరోగ్యకరమైన జీవనవిధానంగా ప్రతి ఒక్కరు స్వీకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, కాణిపాకం దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, ఇఓ పెంచల కిషోర్, ఆర్డీఓ శ్రీనివాసులు, ఆయూష్ నోడల్ ఆఫీసర్ గోవిందప్ప, టూరిజం శాఖ అధికారి గౌరి, స్థానిక ఎస్ఐ నరసింహులు, ఎంపిడిఓ, ఎంఇఓ, ఆరోగ్యశాఖ అధికారులు, యోగా మాస్టర్లు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడి సన్నిధిలో సుప్రీంకోర్టు జడ్జి



కాణిపాకం, జూన్ 12 ప్రభాతవార్త: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పివి నాగరత్న శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొని వారు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, కాణిపాకం ఆలయ ఎఇఓలు రవీంద్రబాబు, ధనపాల్, సూపరిటెండెంట్లు వాసు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు రూ.40 లక్షల విలువైన ఉపకరణాలు పంపిణీ

చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త: ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శుక్రవారం ఎఎల్ఐఎంసిఓ ద్వారా ఉపకరణాలు పంపిణీ చేశారు. చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాల సమీపంలోని జ్యోతిరావుపూలే భవన్‌లో సమగ్రశిక్ష అదనపు కో-ఆర్డినేటర్ వెంకటరమణ, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ తేజోమూర్తి, ఐఇఆర్పి కో-ఆర్డినేటర్ మధు, ఎఎల్ఐఎంసిఓ సంస్థ సభ్యురాలు సోనియాలు దివ్యాంగులకు ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 564 ఉపకరణాలను దివ్యాంగులకు పంపిణీ చేశారు. వీటిలో 30 వీల్ ఛైర్లు, 10 ట్రైసైకిళ్ళు, 268 టీచింగ్ అండ్ లెర్నింగ్ మెటీరియల్ కిట్లు, 59 వాకర్లు, 70 హియరింగ్ ఎయిడ్స్, 12 క్రచ్‌లు, 22 సెరెబ్రల్ పాల్సీ వీల్‌ఛైర్లు, 2 బ్రెయిలీ కిట్లు తదితర ఉపకరణాలు వున్నాయి. ఈ కార్యక్రమంలో ఎఎల్ఐఎంసిఓ సంస్థ నుండి సూర్యకుమార్, అమర్‌కుమార్, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఐఈఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన జిల్లా దేశం నేతలు



చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త: తిరుపతిలో శుక్రవారం నిర్వహించిన 'రెండేళ్ళ నమ్మకం, అభి వృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడుకుజిల్లాతెలు గుదేశ ం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఎం నారా చంద్రబాబునాయుడును కలిసిన చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి జిల్లాలోని పార్టీ కార్యకలాపాలను వివరించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ప్రజలకు వెన్ను పోటు పొడిచిన కూటమి ప్రభుత్వం

**–నిప్పులు చెరిగిన మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ**



**పలమనేరు, జూన్ 12 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పిలుపు మేరకు కూటమి ప్రభుత్వ రెండేళ్ళ పాలనపై నిరసన వ్యక్తం చేస్తూ పలమనేరులో వైసిపి శ్రేణులు కదం తొక్కారు. శుక్రవారం స్థానిక ఎంబిటి రోడ్డులో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేగౌడ మాట్లాడుతూ ఇంత అద్వాన్నమైన ప్రభుత్వం దేశంలో ఎక్కడాలేదని నిప్పులు చెరిగారు. ఎన్నికల సమయంలో అలవిగాని హామీలతో ప్రజలను మోసగించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. వితంతు పెన్షన్లు, ఒంటరి మహిళల పెన్షన్లు వంటి వాటిని అమలు చేయడంలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకం తల్లికి వందనం పేరుతో మార్పు చేసి కేవలం కూటమి పార్టీలకు చెందిన కొంత మంది మహిళలకు మాత్రమే అందజేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఇంత కక్ష పూరింతంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం ఎక్కడాలేదని వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెపుతారని హెచ్చరించారు. నాయకులు హేమంత్‌కుమార్‌రెడ్డి, బాలాజీనాయుడు, మొగసాల క్రిష్ణమూర్తి, మొగసాల రెడ్డెప్ప, కేశవులు, శ్యామ్, కమాల్‌బాషా, వెంకటరెడ్డి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయోత్సవ సభకు తరలిన తెదేపా నేతలు



**చిత్తూరురూరల్, జూన్ 12 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతి దామినేడులో నిర్వహిస్తున్న విజయోత్సవ సభకు చిత్తూరు నియోజకవర్గ తెదేపా నేతలు తరలివెళ్లారు. గురువారం ఉదయం చిత్తూరు ఎమ్మెల్యే గుర జాల జగన్‌మోహన్ ఆధ్వర్యంలో బి విరెడ్డి కాలనీ స్వగృహం నుంచి భారీగా తె లుగు దేశం నాయకులు, కార్యకర్తలు బయలు దేరారు.నియోజకవర్గం నుంచి సుమారు 150 వాహనాల్లో విజయోత్సవ భారీ బహిరంగ సభకు తరలివెళ్లారు.

## కొత్తగా పెన్షన్లకు అర్జీలు స్వీకరణ

***పలమనేరు, జూన్ 12, ప్రభాతవార్త:*** కొత్తగా పెన్షన్లకు సచివాలయాల్లో అర్జీల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 12 నుండి అర్జీలు అందజేయవచ్చని మీడియాలో వార్తలు రావడంతో ఆశావహులు ముందుగా అన్ని సర్టిఫికేట్లు సిద్ధం చేసుకొని సచివాలయాల్లో అందజేస్తున్నారు. ఐతే అధికారికంగా ప్రభుత్వం నుండి ఎలాంటి ప్రకటన లేక పోవడంతో అయోమయంలో పడిపోతున్నారు. వితంతు పెన్షన్లకు ఆధార్ కార్డు, ఆధార్‌కార్డుకు లింక్ అయిన మొబైల్‌నంబర్, కులం ధృవీకరణ సర్టిఫికేట్, ఆదాయం సర్టిఫికేట్, రేషన్‌కార్డు, భర్త మృతిచెందిన డెత్ సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలు అందజేయాలి. ఒంటరి మహిళల పెన్షన్‌కు ఆధార్‌కార్డు, లింక్ అయిన మొబైల్‌నంబర్, కులం ధృవీకరణ సర్టిఫికేట్, ఆదాయం సర్టిఫికేట్, రేషన్‌కార్డు, కోర్టు నుండి లేదా ప్రభుత్వం నుండి విడాకులు తీసుకున్న పత్రాలు సమర్పించాలి. వికలాంగుల పెన్షన్‌కు ఆధార్‌కార్డు, లింక్ అయిన మొబైల్‌నంబర్, కులం ధృవీకరణ సర్టిఫికేట్, ఆదాయం సర్టిఫికేట్, రేషన్‌కార్డు, ప్రభుత్వ డాక్టర్ ఇచ్చిన వికలాంగత్వం సర్టిఫికేట్ అందజేయాలి, వృద్ధాప్య పెన్షన్లకు ఆధార్‌కార్డు, లింక్ అయిన మొబైల్‌నంబర్, కులం ధృవీకరణ సర్టిఫికేట్, ఆదాయం సర్టిఫికేట్, రేషన్‌కార్డు, 60 ఏళ్ళు పైబడిన సర్టిఫికేట్ ఇవ్వాల్సి ఉంటుంది.

## ఉపాధి కూలీలకు 125 రోజుల పని దినాలు : ఎంపీడీ



**కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త:** విజి రాంజీ ఉపాధి పథకంలో భాగంగా కూలీలకు 125 రోజులు పని దినాలను జూలై నెల నుంచి కల్పించడం జరుగుతుందని ఎంపీడీ ఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కంగుంది పంచాయితీ కౌశిగానిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో హరినాథ్ పాల్గొన్నారు.

## ఈ ఆటోల ద్వారా చెత్త సేకరణ



**కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఆదేశాల మేరకు కుప్పం మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో ఈ ఆటోల ద్వారా నిత్యం చెత్త సేకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని దాసే గానూరు స్వర్ణ గ్రామంలో ఆయన ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు .

## విజయోత్సవ సభకు భారీగా తెలుగు తమ్ముళ్లు



కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త: సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతి దామినేడులో జరిగిన విజయోత్సవ సభకు కుప్పం నుంచి తెలుగు తమ్ముళ్ల భారీ సంఖ్యలో హాజరయ్యారు. దాదాపు 60కు పైబడిన బస్సుల్లో, అధిక సంఖ్యలో కార్లలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు తిరుపతికి తరలి వెళ్లారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికేయం యుడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, మండలాల పార్టీ అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు ఈ కార్యక్రమం కు హాజరయ్యారు .

## కూటమి దౌర్జన్యాలపై పోరాటం ఆగదు : ఎమ్మెల్సీ భరత్



కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం దౌర్జన్యాలపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఎమ్మెల్సీ, కుప్పం వైసిపి ఇన్చార్జ్ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ పథకాలని హామీలు ఇచ్చి ప్రజలు, మహిళలు, యువతను మోసగించారని ఆయన ఆరోపించారు. కూటమి నాయకుల అవినీతి, అక్రమాలను ప్రశ్నించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు బనాయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు .కుప్పం నియోజకవర్గంలో టిడిపి నాయకులు గ్రానైట్, రేషన్ బియ్యం ఇసుక అక్రమ రవాణాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. హంద్రీనీవా నీళ్లతో నిండిన చెరువుల్లో సైతం అభివృద్ధి పనుల పేరిట 10 20 లక్షలు బిల్లులు చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు హెచ్ఎం మురుగేష్, దండపాణి,మున్సిపల్ వైకాపా అధ్యక్షుడు హాఫీజ్, ఉపాధ్యక్షులు మునిరాజు, మోహన్ రామ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి, గుడిపల్లి జడ్పిటిసికృష్ణమూర్తి,వన్నియకులక్షత్రియరాష్ట్రవిభాగం అధ్యక్షుడు హెచ్ఎం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం స్వాధీనం...నలుగురు అరెస్ట్

కుప్పం,జూన్ 12 ప్రభాతవార్త: కుప్పం మండలంలోని వేపూరు ,వానగుట్టపల్లి తదితర గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతున్న నలుగురు వ్యక్తులను కుప్పం ఎస్సై బాబు అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కుప్పం డి.ఎస్.పి పార్థసారథి తెలిపారు. వెంకటేష్, సెల్వం, మురళి ,సిద్ధప్ప అనే నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అక్రమ మద్యాన్ని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లోఎవరైనాఅక్రమంగా మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని డిఎస్పీ హెచ్చరించారు.

## తిరుపతికి తరలిన దేశం నేతలు



శాంతిపురం, జూన్ 12 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ పాలన రెండేళ్లు పూర్తి చేసుకోవడంతో తిరుపతిలో శుక్రవారం నిర్వహించిన విజయోత్సవ బహిరంగ సభ కార్యక్రమానికి శాంతి పురం మండలం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులుకార్యకర్తలు అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో ఆర్టిసి వైస్ చైర్మన్ పి ఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, పికేఎం యుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథ నాయుడు,నేతలు గిరి ,మణి, చంద్ర ,గోపాల్, నామాలప్ప, చంద్ర, రాజేంద్ర,మంజునాథ్, శివ,నాగరాజు, గోవిందరాజులు, బాలు, బసవరాజు,సుగుణమ్మ, చంద్రకళ, అనసూయ, శ్యామలమ్మ, పౌలా రాణి, రూప పాల్గొన్నారు .

# తిరుపతి డివిజన్

## విజయోత్సవ సభకు భారీ జనాలు : ముక్కా



రైల్వేకోడూరు రూరల్, జూన్ 12(ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు, బిజెపి చీఫ్ మాధవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్డీఏ రెండేళ్ల విజయోత్సవ సభకు భారీగా జనాలు హాజరైనట్లు రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శుక్రవారం రైల్వే కోడూరు నియోజకవర్గంలోని కూటమినేతలు భారీగా బయలుదేరి శెట్టిగుంట ప్రాంతం నందు ఏర్పాటు చేసిన అల్పాహార విందు కార్యక్రమంలో పాల్గొని, అనంతరం తిరుపతిలోని దామినేడు ప్రాంతంలో కార్యక్రమానికి కోడూరు నియోజకవర్గం నుండి భారీగా జనాలు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఊహించని రీతిలో మహిళలు విరివిగా పాల్గొనడం ఎంతో ఆశ్చర్యానికి గురి చేసిందని అన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో కూటమికి సంబంధించిన తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు విరివిగా పాల్గొన్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తోపాటు టిడిపి యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డిలు పాల్గొని భారీగా తరలి వచ్చిన నాయకులకు కార్యకర్తలకు శెట్టిగుంట వద్ద భారీగా స్వాగతం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగారాజు రవి కుమార్ రాజు, కల్లా చలపతి, అనుమల గండం చంద్రమోహన్, గిరి నాయుడు, ఓబులవారిపల్లి మాజీ మండల అధ్యక్షుడు గంగరాజు వెంకటేశ్వరరాజు, కె ఆర్ కండ్రిక చందర్ రాజు,మాధవరం పోడు శేఖర్ రాజు, తిరుపతి శేఖర్, రామరాజు, ముని పెంచల్ రెడ్డి, సిద్ధిరామిరెడ్డి, పరశురాం రెడ్డి, ఓబులవారిపల్లి వాసుదేవరెడ్డి, తిప్పన రాజశేఖర్, పసుపులేటి జయచంద్ర, కృష్ణంరాజు, పందేటి వెంకటరామరాజు, ఆకేపాటి సుకుమార్ రెడ్డి తో పాటు కూటమికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

## విలువైన చెరువు మట్టి తరలింపు!



ఓబులవారిపల్లి, 12 జూన్ ప్రభాతవార్త: విలువైన చెరువు మట్టిని వివిధ ఉపయోగాల కోసం, ఎడతెరిపి లేకుండా గత రెండు వారాలకు పైనే పెద్దఓరంపాడు చెరువు నుంచి యంత్రాలతో లోడింగ్ చేసి టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. అటు ఇరిగేషన్ ఇటు రెవెన్యూ అధికారులు ప్రేక్షకు పాత్ర వ్యవహరిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఇరిగేషన్ అధికారులు రెవెన్యూ అధికారులు అనుమతి పొందినప్పటికీ నిబంధన ప్రకారం ఏర్పాటు చేసి గుంతల గుంతలుగా మట్టిని తోడకుండా, అధికారుల పర్యవేక్షణలో మట్టి తరలింపు జరగాలి ఇలాంటివి మాకు పట్టమంటూ ఓబులవారిపల్లి జిల్లాలు మనకు చెరువులోనూ పలువురు మట్టి వ్యాపారులకు అధికారులు సహకరించి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని విమర్శలు వున్నాయి.

## నేడు మండలంలో విద్యుత్తుకు అంతరాయం



పెనగలూరు జూన్ 12 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనమలూరు మండలం నేడు పెనగలూరు , చిట్వేలు, పుల్లంపేట మండలముల పరిధిలో విద్యుత్ సరఫరా అంతరాయం.... 33 కేవీ తిమ్మయ్యగారిపల్లి, చిట్వేలు, రెడ్డిపల్లి ఫీడర్లల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చిట్వేలు విద్యుత్ శాఖ దీనిని బాలాజీ తెలిపారు.

## మునిగిన మామిడి రైతన్నలు!



ఓబులవారిపల్లి, 12 జూన్ ప్రభాతవార్త: ప్రపంచ మార్కెట్ను శాసించే మంగపేట ముగ్గురాయి ఆ తర్వాత, రైల్వే కోడూరు నియోజకవర్గంలో దేశంలోనే అత్యంత మన్నికైన ఉత్పత్తి చెందేది మామిడికాయలు. అయితే గత నాలుగు సంవత్సరాలుగా రైతులు లక్షలాది రూపాయలు మందులకు, వ్యవసాయానికి సాగుకు వెచ్చిస్తే కనీసం మందులకు ఖర్చులు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష రూపాయలు మందులు కొడితే, ఆ మామిడికాయ రైతులు కనీసం 30 వేల రూపాయలు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడి రైతులు నిండా మునిగారిని, అప్పులు ఊబిలో కూరుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క ఢిల్లీ వ్యాపారులు అటు మందిల వ్యాపారులు సిండికేటై ధరలు పెంచక, కాయలు ధరలను కేవలం తగ్గించి గ్రేడులులో గందరగోళం సృష్టించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు నాయకులు పునరాలోచించి రైతులకు గిట్టుబాటు ధరలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు

## పెనగలూరులో భారీ వర్షం



పెనగలూరు, జూన్ 12 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వీధుల వెంట కాలువల్ల అర్ధడుగు ఎత్తు వర్షపు నీరు ప్రవహించింది. సాయంత్రం ఐదు గంటల నుంచి 6 గంటల దాకా భారీ వర్షం కురవడంతో రెండు పదునుల వర్షం కురిసిందని ప్రజలనుకుంటున్నారు. ఐదు గంటలకు ఉరుములు మెరుపులతో ఓ మోస్తరుగా ప్రారంభమైన వర్షం మధ్యలో భారీగా కురిసింది అనంతరం కొంతసేపు నెమ్మదిగా కురిసి మరలా ఊపొందుకొని అతి భారీ వర్షం కురిసింది. పది నిమిషాల సేపు అతి భారీ వర్షం వల్ల పలు గ్రామాలలో వీధులన్నీ పంట కాలువల తరహాలో వర్షపు నీటితో పొంగి ప్రవహించాయి. దామరచర్ల వెలకచర్ల ఉప్పరపల్లి కొండూరు కిరణం పల్లి సిరివరం గట్టువారిపల్లి తూర్పు ఈటిమాపురం కట్టవారిపల్లి మూగవారిపల్లి గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని పరిసర గ్రామాలలో భారీ వర్షం కురవడం విశేషం.

## అంకితభావంతో పనిచేయండి



కార్వేటినగరం,జూన్ 12 ప్రభాతవార్త: రెవిన్యూ సిబ్బంది అందరూ ప్రజాసేవ, చిత్తశుద్ధి,అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని నగరి ఆర్డీఓ డాక్టర్ యం.అనుపమ తెలియ జేశారు. ఈ మేరకు ఆర్డీఓ కార్వేటినగరం తాహశీల్దార్ కార్యాలయంలో రీ-సర్వే రెవిన్యూ అంశాల పురోగతిపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ప్రజలకు సేవచేసే అవకాశం ఒక రెవిన్యూ సిబ్బందికి మాత్రమే వస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రణాళిక బద్ధంగా మనకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అందరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. మండలంలోని కొటార్వేడు,డి.యం.పురం రెవిన్యూ గ్రామాలలో నిర్వహిస్తున్న 5విడత రీ-సర్వే పురోగతిపై విఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లతో విడివిడిగా మాట్లాడి వారు అడిగిన ప్రశ్నలకు జవాబు ఇచ్చి వవారు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపించారు. కార్యక్రమంలో తాహశీల్దార్ కె.నాగరాజు,డివిజనల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్,డిప్యూటీ తాహశీల్దారులు లోకేష్,స్వరూపరాణి,మండల సర్వేయరు మార్కొండయ్య,ఆర్ఐటి.నరసింహులు,విఆర్ఓలు,విలేజ్‌సర్వేయర్లు పాల్గొన్నారు.

## నీర్పాకోటలో వైభవంగా గంగమ్మ జాత

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 12 ప్రభాతవార్త:



మండలంలోని బుచ్చినాయుడు కండ్రిగ మండలం నీర్పాకోట గ్రామంలో శుక్రవారం వైభవంగా గంగమ్మ జాతరను కన్నుల పండువగా నిర్వహించారు. జాతర సందర్భంగా విద్యుత్ దీపాలు అలంకరించి జాతర కార్యక్రమమును వైభవంగా నిర్వహించారు. ఆదివారం ముగింపు రోజున వైభవంగా భక్తులు పొంగులను సమర్పించి ముక్కులు తీర్చుకోవడం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. నీర్పకోట గ్రామ ప్రజలతోపాటు భక్తులు పాల్గొని గంగమ్మ తల్లి కృపను పొందాలని తెలియజేశారు.

## సీఎం, డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే ఘన వీడ్కోలు



తిరుపతి విద్య,జూన్ 12 ప్రభాతవార్త: తిరుపతిలో నిర్వహించిన రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం బహిరంగ సభకు హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ . చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం మధ్యాహ్నం సభ విజయవంతంగా ముగిసిన అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక విమానంలో బయలుదేరేందుకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. వర్షం కురుస్తున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి చేరుకుని వారికి వీడ్కోలు తెలిపారు. కార్యక్రమంలో ఆరణి మదన్‌తో పాటు ఎన్డీఏ కూటమికి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రవేశ పరీక్షలపై అవగాహన సదస్సు

తిరుపతి విద్య, జూన్ 12 ప్రభాతవార్త:

తిరుపతి నగరంలోని వరదరాజనగర్‌లో ఉన్న విశ్వం విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ (ఆదివారం) ఉదయం సైనిక్ స్కూల్, నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలుగా పేరుగాంచిన సైనిక్ స్కూల్స్, జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశం పొందేందుకు విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అవసరమని పేర్కొన్నారు. ఆ దిశగా విద్యార్థులు, తల్లిదండ్రులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు ఈ ప్రత్యేక సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.మరిన్ని వివరాల కోసం 86888 88802, 93999 76999 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి పేర్కొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయం 63వ వ్యవస్థాపక దినోత్సవం

తిరుపతి విద్య, జూన్ 12 ప్రభాతవార్త:



ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 63వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్)లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సహ పరిశోధనా సంచాలకులు, వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ (ఇన్‌చార్జి), ఆర్ఏఆర్ఎస్ తిరుపతి అధికారి డా. టి. మురళీకృష్ణ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా డా. టి. మురళీకృష్ణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం స్థాపన చరిత్ర, వ్యవసాయ రంగ అభివృద్ధిలో దాని కీలక పాత్ర, రైతు సంక్షేమానికి అందిస్తున్న పరిశోధన సేవలను వివరించారు.ప్రధాన శాస్త్రవేత్త డా. ఎస్. కలీముల్లా విశ్వవిద్యాలయం సాధించిన పరిశోధన పురోగతి, వివిధ పరిశోధనా కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించారు. వాతావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డా.టి. ప్రతిమ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ కీర్తిని మరింత పెంపొందించేందుకు శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, బోధన మరియు బోధనేతర సిబ్బంది, వ్యవసాయ పాలిటెక్నిక్ అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం వందన సమర్పణతో ముగిసింది.

## భారత-జర్మన్ శాస్త్ర సహకారంపై కీలక చర్చలు

– ఆచార్య టాటా నరసింగ రావు



తిరుపతి విద్య,జూన్ 12 ప్రభాతవార్త: ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య టాటా నరసింగ రావు బెంగళూరులో నిర్వహించిన ఇండోజర్మన్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్ 21వ పాలకమండలి సమావేశంలో పాల్గొన్నారు.ఈ సమావేశానికి భారత శాస్త్ర సాంకేతిక విభాగం ప్రతినిధి డా. ప్రవీణ్ కుమార్ సోమసుందరం, అలాగే జర్మనీ విద్యా, పరిశోధన మంత్రిత్వ శాఖ ప్రతినిధి కాథ్రిన్ మేయర్ అధ్యక్షత వహించారు.భారతదేశం, జర్మనీ మధ్య శాస్త్రం, సాంకేతికం, ఆవిష్కరణలు ,పరిశ్రమ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో భారత ప్రభుత్వం, జర్మనీ రాయబార కార్యాలయం, రెండు దేశాలకు చెందిన పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్వీయూ ఉపకులపతి పాల్గొనడం విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చిందని అధికారులు తెలిపారు.

## నూతన విద్యా సంవత్సరం ఘనంగా ప్రారంభం

తిరుపతి విద్య, జూన్ 12 ప్రభాతవార్త:



స్థానిక బైరాగి పట్టెడలోని మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో నూతన విద్యా సంవత్సరం ఘనంగా ప్రారంభమైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. పరందామనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు హృదయపూర్వక స్వాగతం పలికారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, కిట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజే పుస్తకాలు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాలు గణనీయంగా మెరుగుపడ్డాయని, విద్యార్థులు అధిక మార్కులు సాధించడం గొప్ప విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు బండి మధుసూదనరెడ్డి, కదిరి రవి, పి. విజయకుమారి, బండి శకుంతల, వి. మురళీమోహన్ రెడ్డి, శేఖర్ బాబు, శ్రీదేవి, ఎం. కుమార్, ఎం. మారుతీ దేవి, యు. కల్పలత, పి. రేణుకా దేవి, ఎస్. ఖదరున్నీసా బేగం, అరుణ శ్రీ, తులసి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నువా న్యాచురల్ డైమండ్ కలెక్షన్ ఆవిష్కరణ

తిరుపతి విద్య, జూన్ 12 ప్రభాతవార్త: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ తన తాజా న్యాచురల్ డైమండ్ ఆభరణాల కలెక్షన్ నువా ను ఆవిష్కరించింది. ప్రకృతి సౌందర్యం, సహజ ఆకృతుల స్ఫూర్తితో ఈ ప్రత్యేక కలెక్షన్‌ను రూపొందించారు.సహజ నిర్మాణాల వంటి చిన్న అంశాలను ఆధునిక హస్తకళా నైపుణ్యంతో సమన్వయం చేస్తూ ఈ కలెక్షన్‌ను తీర్చిదిద్దినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కలెక్షన్ ద్వారా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తన న్యాచురల్ డైమండ్ పోర్ట్‌ఫోలియోను మరింత బలోపేతం చేస్తూ, ప్రకృతి ప్రేరణతో కూడిన ఆధునిక డిజైన్‌లను వినియోగదారులకు అందిస్తున్నట్లు తెలిపింది.

## శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న సీజే



తిరుచానూరు, జూన్ 12 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ శుక్రవారం తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని అమ్మవారి అనుగ్రహాన్ని పొందారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన గౌరవ ప్రధాన న్యాయమూర్తికి టీటీడీ జేఈవో డా. ఎ. శరత్, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ కపిలేశ్వర స్వామివారిని దర్శించుకున్న సీజే అంతకుముందు జస్టిస్ లీసా గిల్ తిరుపతిలోని శ్రీ కపిలేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకోగానే సీజేకు టీటీడీ జేఈవో డా. ఎ. శరత్, ఆలయ అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు శ్రీ హరీంద్రనాథ్, శ్రీమతి నాగరత్న, విజిఓ శ్రీ గిరిధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

శ్రీకాళహస్తి,జూన్ 12 ప్రభాతవార్త:



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహించుటకు నిర్ణయించినట్లు మున్సిపల్ కమిషనర్ కెవి కృష్ణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా స్థాయిలోని అధికారులతో నిర్వహిస్తున్న ఈ వేదికను ఇక మీదట ప్రతి సోమవారం మున్సిపల్ స్థాయిలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వివరించారు.

## ముఖ్యమంత్రి బహిరంగ సభకు భారీగా తరలిన టిడిపి శ్రేణులు

కోనేటి సుమన్‌కుమార్ నేతృత్వంలో 30 వాహనాల్లో



నారాయణవనం, జూన్ 12 ప్రభాతవార్త : తిరుపతిలోని దామినేడులో శుక్రవారం జరిగిన కూటమి ప్రభుత్వం బహిరంగ సభకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్‌ల నేతృత్వంలో వారి అనుచరులు వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, ఒక బస్సు, 30 కార్లలో తరలి వెళ్లారు. నారాయణవనం దూండి వినాయకుని ఆలయం వద్ద పూజలు చేసుకున్న తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రెండేళ్ల కూటమి ప్రభుత్వ బహిరంగ సభకు తరలి వెళ్లారు.టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

## పద్మావతీ అమ్మవారికి ఘనంగా ఊంజల్‌సేవ



నారాయణవనం, జూన్ 12 ప్రభాతవార్త : నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం ఊంజల్‌సేవ ఘనంగా జరిగింది. అంతకు ముందు అమ్మవారిని, స్వామి వారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అధిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారిని ఆలయంలో ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు.

## యోగా పోటీల్లో పాల్గొనండి

తిరుపతి కార్పొరేషన్, జూన్ 12 ప్రభాతవార్త :



యోగాంధ్ర లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న యోగా పోటీల్లో ఔత్సాహికులు పాల్గొనాలని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక కచ్చాపి ఆడిటోరియం నందు యోగా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా విభాగాల్లో ఔత్సాహికులైన వారు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## సిఎం బహిరంగ సభకు హాజరైన ఎమ్మెల్యే



నారాయణవనం, జూన్ 12 ప్రభాతవార్త : తిరుపతిలోని దామినేడులో రెండేళ్ల కూటమి ప్రభుత్వం శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్, నారాయణవనం జడ్పీటీసీ కోనేటి సుమన్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జీ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్‌యాదవ్, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మిలను కలిశారు. అనంతరం జరిగిన సిఎం బహిరంగ సభలో పాల్గొన్నారు.

## హామీల అమలులో వెన్నుపోటుకు రెండేళ్ళు...

చంద్రగిరిలో వైసిపి భారీ ర్యాలీ






చంద్రగిరి, జూన్ 12 ప్రభాతవార్త: అధికారం కోసం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వ వెన్నుపోటుకు రెండేళ్ళు పూర్తయినట్లు చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి దుయ్యబట్టారు. పార్టీ నాయకత్వం పిలుపు మేరకు శుక్రవారం చంద్రగిరిలో వైసిపి చిత్తూరు పార్లమెంట్ పరిశీలకుడు చవ్వా రాజశేఖర్ రెడ్డి, వైసిపి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ నుండి సాయిబాబా ఆలయం వరకు భారీ నిర్వహించారు. ఈ సందర్భంగా టవర్‌క్లాక్ వద్ద కూటమి మ్యానిఫెస్టో, సూపర్ సిక్స్ పత్రాలను దగ్ధం చేసిన పార్టీ నాయకులు కార్యకర్తలు చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హామీలను అమలు చేయడంలో విఫలమైన కూటమి ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో వున్నట్లు తెలిపారు. ప్రజల తరపున వైఎస్ జగన్ చేస్తున్న పోరాటానికి మద్దతు పెరుగుతున్నట్లు తెలిపారు. నిరుద్యోగభృతి, ఆడబిడ్డ నిధి, సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయంటూ నిలదీశారు. గడచిన రెండేళ్ళ కూటమి పాలనలో అవినీతి, అక్రమాలు విపరీతంగా పెరిగినట్లు ఆరోపించారు. నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అధినాయకుడి ఆశీస్సులతో జన్మదిన వేడుకలు

చంద్రగిరి, జూన్ 12 ప్రభాతవార్త:



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వాలంటీర్స్ విభాగం మండల అధ్యక్షుడు సూరి శుక్రవారం తన అధినాయకుడు, మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆశీస్సులతో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. పార్టీలో క్రమశిక్షణతో పనిచేస్తున్న సూరి పుట్టిన రోజును పురస్కరించుకుని చెవిరెడ్డి తన నివాసానికి పిలిపించుకుని దుశ్శాలువతో సత్కరించి, స్వీట్ తినిపించి ఆశీర్వదిస్తూ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలో వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిఖ్ సాయి రాయల్, శశిధర్ రెడ్డి, సాయిచంద్, పలువురు నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**CHANGE OF NAME**

● I,ARE LAKSHMIDEVI (Old Name), W/o ARE VIJAY KUMAR, POSSPORT No.R5907874, 1-130, INDLURU VILLAGE,PENAGALUR POST, PENAGALUR MANDAL,TIRUPATI DIST,A.P. HAS CHANGED MY NAME AS ARI LAKSHMIDEVI (NEW NAME) W/O ARI VIJAY KUMAR

(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
కుప్పం-2 శాఖ - 517502
చిత్తూరు జిల్లా

**అమ్మకం ప్రకటన**

**సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు) దిగువ తెలిపిన ఋణగ్రహీత మెస్సర్స్ వివిఎస్‌టి శివం ఫుడ్ ఇండస్ట్రీస్ మరియు దాని యొక్క భాగస్వాములు శ్రీ వి.వేలు మరియు శ్రీమతి ఎస్.భాగ్యవతి వారికి చెందిన ఆస్తులను సెక్యూర్డు క్రెడిటారుకు తనఖా/ఛార్జిలో వుంచి నిర్మితంగా అధీకృత అధికారి, కుప్పం-2 శాఖ, కెనరాబ్యాంక్ వారికి బకాయి వున్న రూ.9,11,504.31 పైసలు + డిమాండ్ నోటీసు తేది: 28.01.2026 నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు స్వాధీనం చేసుకుని "ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా వున్నదో అలానే" మరియు "అక్కడ ఏమి వున్నదో అదే అనే పద్ధతిపై 15.07.2026న వేలం వేయుటకు నిర్ణయించినారు. రిజర్వుధర, ధరావత్తు, స్థిరాస్తుల యొక్క పూర్తి వివరాలు దిగువ తెలుపబడమైనది.

**స్థిరాస్తి వివరములు:-** చిత్తూరు జిల్లా,కుప్పం సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా కుప్పం మండలం,ఎన్.కొత్తపల్లి గ్రామ పంచాయితీ ఏరియా, 159 సజ్జలపల్లి రెవిన్యూ గ్రామం సర్వేనెం.24/2 మెట్ట - ఎ.1.25 సెంట్లలో 1480 చ.అ. లేదా 164.44 చ.గ. ఖాళీ స్థలం. ఇందున నూతనంగా నిర్మించిన ఆర్.సి.సి. రూఫ్ గల డి.నెం.1-28 & అసెస్‌మెంట్ నెం.139 మరియు ఎస్‌సి నెం.221000300 సజ్జలపల్లి డిస్ట్రిబ్యూషన్ లోని గల రెసిడెన్షియల్ ఇల్లు . ఖాళీ స్థలం కొలతలు: తూర్పు-పడమర:-37అ. (11.27మీ. ఉత్తరం- దక్షిణం: 40అ. (12.19మీ.) వెరశి 1480చ.అ. లేదా 164.44 చ.గ. నిర్మాణం విస్తీర్ణం - ఆర్‌సిసి రూఫ్ గల ఇల్లు: గ్రౌండ్ ఫ్లోర్ తూర్పు నుండి పడమర: 37అ. (11.27మీ.) ఉత్తరం-దక్షిణం: 40అ.(12.19మీ.) వెరశి 1480 చ.అ. ఈ మధ్య తూర్పు : వెంకటస్ అనే వెంకటాచలం వద్దనున్న భూమి పడమర: మట్టిరోడ్డు, ఉత్తరం: వెంకటస్ అనే వెంకటాచలం వద్దనున్న భూమి దక్షిణం: వెంకటస్ అనే వెంకటాచలం వద్దనున్న భూమి

| | |
|---|---|
| **రిజర్వు ధర : రూ.16,58,000.00** | **ధరావత్తు : రూ.1,65,800.00** |

**ధరావతు సమర్పణకు ఆఖారు తేది & సమయం: 13.07.2026 సా.5.00గం॥లకు లేదా ఆలోపు.** అమ్మకానికి సంబంధించిన పూర్తి నియమ నిబంధనలు కెనరాబ్యాంకు వారి వెబ్‌సైట్ **www.canarabank.com**లోని పొందుపరిచిన "ఈ-ఆక్షన్" అను లింక్‌ను పరిశీలించగలరు. **లేదా అధీకృత అధికారి, కెనరాబ్యాంక్, ప్రాంతీయ కార్యాలయం, తిరుపతి, ఫోన్:0877-2500130, 7901092637** వారిని కార్యాలయ పనివేళలో సంప్రదించగలరు.

ప్రదేశం:కుప్పం, తేది: **09.06.2026** — అధీకృత అధికారి, కెనరాబ్యాంక్

# ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో...

## 1000 విజయవంతమైన సిటివిసి శస్త్రచికిత్సలు – హృదయ వైద్యంలో మరో కీలక మైలురాయి

తిరుపతి హెల్త్,జూన్ 12 ప్రభాతవార్త:



తిరుపతిలోని ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ హృదయ వైద్య రంగంలో మరో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ఆసుపత్రిలోని కార్డియోథొరాసిక్ అండ్ వాస్క్యులర్ సర్జరీ విభాగం 1000కు పైగా విజయవంతమైన హృదయ శస్త్రచికిత్సలను పూర్తి చేసి, రాయలసీమ మరియు దక్షిణ ఆంధ్ర ప్రాంతంలో అత్యధిక సిటివిసి శస్త్రచికిత్సలు నిర్వహించిన కేంద్రంగా గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆసుపత్రి వైద్య బృందం ఈ విజయానికి దోహదపడిన అంశాలను, హృదయ వైద్యంలో తమ సేవా ప్రయాణాన్ని మీడియాతో పంచుకుంది. డా. పి. త్రిలోక్ (సర్జన్) మాట్లాడుతూ 2023 మే నెలలో ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో దిగిజులీ విభాగాన్ని ప్రారంభించాము. ప్రారంభించిన కొద్ది కాలంలోనే 1000కు పైగా విజయవంతమైన హృదయ శస్త్రచికిత్సలు పూర్తి చేయడం ఎంతో ఆనందంగా ఉంది. రాయలసీమ మరియు దక్షిణ ఆంధ్ర ప్రాంతంలో ఇదే అత్యధిక సంఖ్య ఈ విజయానికి కార్డియాలజీ విభాగం, అనస్థీషియా బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది, ఆసుపత్రి యాజమాన్యం అందించిన సహకారం ప్రధాన కారణం. ప్రతి రోగికి ఉత్తమ ఫలితాలు అందించడమే మా లక్ష్యం అని తెలిపారు. డా. శ్రీధర్ ముని (చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్) మాట్లాడుతూ మా ఆసుపత్రిలో బలమైన కార్డియాలజీ సిటివిసి విభాగాలతో పాటు అత్యంత నైపుణ్యం కలిగిన అనస్థీషియా, క్రిటికల్ కేర్ బృందం ఉండటం వల్లే ఈ అరుదైన మైలురాయిని చేరుకోగలిగాం. ప్రపంచ స్థాయి ఫలితాలను అందించడంలో మా వైద్య బృందం నిరంతరం కృషి చేస్తోంది. గత మూడు సంవత్సరాల్లో ఎన్నో క్లిష్టమైన హృదయ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించామన్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా, అందుబాటు ధరల్లో చికిత్స అందించడం మా ప్రత్యేకత. సిటివిసి శస్త్రచికిత్సలను లాభాల కోసం కాకుండా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్నాం అని పేర్కొన్నారు. డా. వి. సునంద కుమార్ రెడ్డి (మేనేజింగ్ డైరెక్టర్) మాట్లాడుతూ సిటివిసి శస్త్రచికిత్సలు అత్యంత క్లిష్టమైనవి అధిక ప్రమాదంతో కూడుకున్నవి. వీటి కోసం ప్రత్యేక పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం మరియు సమర్థవంతమైన మద్దతు వ్యవస్థ అవసరం. అందుకే ప్రతి ఆసుపత్రిలో ఇలాంటి హృదయ శస్త్రచికిత్సలు నిర్వహించడం సాధ్యం కాదు. అయితే మా ఆసుపత్రిలో ఉన్న బలమైన వైద్య బృందం, ఆధునిక సాంకేతిక సదుపాయాలు మరియు యాజమాన్య నిబద్ధతతో 2023లో చిన్న స్థాయిలో ప్రారంభించిన ఈ విభాగం నేడు 1000 విజయవంతమైన శస్త్రచికిత్సల మైలురాయిని చేరుకుంది. ఈ సమాచారం ప్రజల్లోకి చేరి మరెంతో మందికి సరైన సమయంలో నాణ్యమైన హృదయ వైద్యం అందేందుకు దోహదపడాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. ఎస్.వి. ప్రసాద్, (మేనేజింగ్ డైరెక్టర్), డా. శ్రీకాంత్, డా. (మేజర్) సుభాష్, డా. పి. సుమంత్ రెడ్డి (ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్), డా. అభిషేక్ కాశ్ (ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్), ఆసుపత్రి సిబ్బంది పాల్గొని, ఈ ఘన విజయాన్ని సాధించిన డా. పి. త్రిలోక్‌ని అభినందించారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ ఎల్లప్పుడూ అత్యాధునిక వైద్యం – అందరికీ అందుబాటులో అనే ధ్యేయంతో ముందుకు సాగుతూ, రాయలసీమ దక్షిణ ఆంధ్ర ప్రజలకు అత్యున్నత హృదయ వైద్య సేవలను అందిస్తోంది. 1000 విజయవంతమైన సిటివిసి శస్త్రచికిత్సల పూర్తి, ఆసుపత్రి వైద్య నైపుణ్యానికి, అత్యాధునిక మౌలిక సదుపాయాలకు, రోగుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది.

## రాబోయే తరాలు గర్వించే సమాజాన్ని నిర్మించడమే...

### కూటమి ప్రభుత్వం సమిష్టి బాధ్యత –రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్



**తిరుపతి కలెక్టరేట్, జూన్ 12 ప్రభాతవార్త :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుదీర్ఘ పాలన, నాయకత్వం, అభివృద్ధి దిశగా దేశాన్ని ముందుకు నడిపించిన విధానాలను ప్రశంసించారు. ఎన్డీఏ కూటమి సమిష్టి కృషితో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో కూటమి ప్రభుత్వ సమన్వయ కృషి, అలాగే ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదంలో ప్రాణ నష్టం నేపథ్యంలో సభను వాయిదా వేసి మానవతా దృక్పథాన్ని చూపిన నాయకత్వాన్ని ఆయన అభినందించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు చూపిన తీర్పు ఒక రాజకీయ మార్పు మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్యానికి కొత్త దిశను ఇచ్చిందన్నారు. భయం, అహంకారం, అధికారం కేంద్రీకరణ వంటి అంశాలను ప్రజలు తిరస్కరించారని తెలిపారు. ప్రజలే అంతిమ నిర్ణేతలని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం కోసం కాకుండా బాధ్యత పంచుకోవడం కోసం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ గారి దృష్టి, సీఎం చంద్రబాబు నాయుడు అనుభవం, జనసేన సంకల్పం కలయిక రాష్ట్ర పునర్నిర్మాణానికి బలమైన పునాదన్నారు. జనసేన 21 సీట్లతో పోటీ చేసి ప్రజల నమ్మకంతో 100 స్ట్రైక్ రేట్ సాధించిందని, ఇది త్యాగం , ప్రజల విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పెంచిన వృద్ధాప్య పింఛన్లు, మహిళలకు ఆర్థిక భరోసా, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు మద్దతు పథకాలు, అన్నా క్యాంటీన్లు, విద్య, యువత ఉపాధి అవకాశాలు లాంటి పథకాలు మాటలకే పరిమితం కాకుండా అమలు చేశామన్నారు.

**గ్రామ స్వరాజ్యం – పంచాయతీ రాజ్ వ్యవస్థ**

గ్రామ స్వరాజ్యం నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది అని, మహాత్మా గాంధీ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, బీఆర్ అంబేద్కర్ ఆలోచనల ఆధారంగా గ్రామ పరిపాలన బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలకు హోదా వచ్చినప్పటికీ, ఆచరణలో నిధులు, అధికారాలు, బాధ్యతల మధ్య సమన్వయం లేక బలహీనతలు ఏర్పడ్డాయన్నారు. నిధుల కొరత , అధికారాల అస్పష్టత, బాధ్యతల విభజన లోపం , గ్రామ పంచాయతీల ఆర్థిక బలహీనత, స్థానిక సంస్థల నమ్మకం తగ్గడం వంటి సమస్యల కారణంగా బ్రోకెన్ గవర్నెన్స్ చైన్ ఏర్పడిందని ఆయన అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి, నిర్ణయాలను గ్రామస్థాయిలోనే తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి సమస్య గ్రామంలోనే పరిష్కరించబడితేనే వ్యవస్థ బలపడుతుందని తెలిపారు. పంచాయతీ వ్యవస్థను నాయకత్వ పాఠశాలగా అభివర్ణిస్తూ, స్థానిక సంస్థల నుంచే నిజమైన నాయకత్వం ఉద్భవిస్తుందని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా నాయకత్వ వేదిక అన్నారు. మహిళలకు 50!! రిజర్వేషన్, స్వయం సహాయక సంఘాలు, యువత భాగస్వామ్యం గ్రామాభివృద్ధికి బలమని పేర్కొన్నారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఆస్తుల నమోదు సరిచేయడం వల్ల ఒక్క గ్రామంలోనే ఆదాయం గణనీయంగా పెరిగిన ఉదాహరణను ఆయన వివరించారు. పన్నులు పెంచకుండా వ్యవస్థ సరిచేయడం ద్వారా ఆదాయం పెరగవచ్చని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, కూటమి బలోపేతం, ప్రజల నమ్మకానికి అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. చివరగా ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ"జై భారత్ – జై హింద్" అని తన ప్రసంగాన్ని ముగించారు.

## ఘనంగా బిజెపి ప్రచార ర్యాలీ

### – బిజెపి మహిళా నాయకురాలు సుగుణావతి యాదవ్ చెరుకుల



తిరుపతి హెల్త్, జూన్ 12 ప్రభాతవార్త:

మోదీ 12 సంవత్సరాల సుపరిపాలన ప్రగతిని ప్రజల్లెకి తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా సుగుణావతి చెరుకుల ఆధ్వర్యంలో దామినేడు ఇండియన్ పెట్రోల్ బంక్ నుండి సభాస్థలికి భారీ ర్యాలీ నిర్వహించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ దిశా నిర్దేశంతో, తిరుపతి జిల్లా అధ్యక్షులు సామాజి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళా నాయకురాలు సుగుణవతి చెరుకుల సమక్షంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. మోడీ నాయకత్వంలో 12 సంవత్సరాల లో జరిగిన అభివృద్ధి కూటమి ప్రభుత్వ నాయకత్వంలో జరుగుతున్న కృషి, పీఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, జల్ జీవన్ మిషన్, వంటి సంక్షేమ పథకాలు ప్రయోజనాలు నాయకులు ప్రజలకు వివరించారు. బిజెపి నాయకులు కూటమి భాగస్వామ్య పక్షాన ప్రతినిధులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభ విజయవంతానికి కృషి చేశారు.

## శ్రీవారి సేవలో హైకోర్టు సిజె జస్టిస్ లీసాగిల్



తిరుమల,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామిని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసాగిల్ కుటుంబంతో కలసి దర్శనం చేసుకున్నారు. ఆలయం పుష్కరిణిలో పవిత్ర జలం సంప్రోక్షణ చేసుకున్నారు. టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తీర్థ ప్రసాదాలు అందించారు.

## హామీ పత్రాలకు నిప్పు

### –చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు



రైల్వే కోడూరు, జూన్ 12 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పాలనకు రెండేళ్లు ముగిసింది. ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం ప్రజలకు మోసపు హామీలను ఇచ్చి గద్దె ఎక్కి ప్రజలను అన్ని విధాల నిర్వీర్యం చేసిందని వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి,రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే,పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కొరముట్ల శ్రీనివాసులు ఎద్దేవ చేశారు. శుక్రవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమాన్ని నిరసిస్తూ రైల్వే కోడూరు పట్టణంలో కొరముట్ల శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం భారీగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ నుంచి టోల్గేట్ వద్ద వైయస్సార్ విగ్రహం వరకు వైయస్సార్ సిపి పార్టీ శ్రేణులు నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, ప్రజలు భారీ ర్యాలీతో వచ్చి ఎన్నికల సమయంలో బాబు ఇచ్చిన మోసపూరితమైన, నెరవేరని హామీల పత్రాలను తగలబెట్టారు. అక్కడ నుంచి వైసిపి పార్టీ కార్యాలయం వరకు వెన్నుపోటుకు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పేద, మధ్యతరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లి, చిట్వేలి, పుల్లంపేట మండల కన్వీనర్లు సాయి కిషోర్ రెడ్డి,చెవ్వు శ్రీనివాస్ రెడ్డి, ముస్తాక్ ల తో పాటు వైఎస్ఆర్సిపి పార్టీ సీనియర్ నాయకులు కోడూరు జడ్పిటిసి ఎంపీటీసీలు మాజీ సర్పంచులు రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డిల తోపాటు వందలాదిమంది వైఎస్ఆర్సిపి శ్రేణులు పాల్గొన్నారు.

## వైద్య విద్యలో నైతిక విలువలు పాటించాలి

### హెల్త్ వర్సిటీ వైస్‌ఛాన్సలర్

పుత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త :



వైద్య విద్యనభ్యసించే విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు పాటించాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం రూరల్ మండలం పరిధిలోని అన్నా గౌరీ మెడికల్ కాలేజీని ఆయన సందర్శించారు. ఆస్పత్రిలోని విద్య, వైద్య, మౌలిక సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులు, అధ్యాపకులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ రోగులకు సేవ చేయడం అత్యున్నత ధ్యేయంగా భావించాలన్నారు. సమావేశంలో పలువురు అధ్యాపకులు, వైద్యులు పాల్గొన్నారు.

## మహిళా వైద్యకళాశాలచే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు



తిరుపతి హెల్త్, జూన్ 12 ప్రభాతవార్త:

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఫిజియాలజీ విభాగం ఆధ్వర్యంలో 7వ రాష్ట్రస్థాయి హయగ్రీవ 2026 క్విజ్‌ను 12వ తేది శుక్రవారం ఉదయం 9 గంటలకు స్విమ్స్ శ్రీ పద్మావతి వైద్య కళాశాల లెక్చర్ గ్యాలరీ 1 నందు నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్, డీన్ డా. అలోక్ సచన్, ఫిజియాలజీ విభాగాధిపతి డా. శరణ్ బి సింగ్, ఫార్మాకాలజీ విభాగాధిపతి డా. ఉమా మహేశ్వర రావు సంయుక్తంగా జ్యోతిని వెలిగించి క్విజ్‌ను ప్రారంభించారు.స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు యంబిబిఎస్ వైద్యకళాశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్విజ్ కార్యక్రమాలు మన స్విమ్స్ శ్రీ పద్మావతి వైద్యకళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్విజ్ వైద్య విద్యార్థులకు ఉన్నటువంటి విజ్ఞానాన్ని పెంపొందించుటకు దోహదపడు తుందన్నారు. ఈ క్విజ్ నందు ప్రథమ స్థానంలో శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల, స్విమ్స్ దక్షిత చాంగ్, కౌసల్య హరిణి, టి.ఎస్. లసిత రెడ్డి, ద్వితియ స్థానంలో శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల, స్విమ్స్ ఆరాధ్య జా, గంగా చెక్కి విటిల్, ఉష శ్రీ, తృతీయ స్థానంలో నారాయణ మెడికల్ కళాశాల, నెల్లూరు పోలంరాజు సాయి అనన్య, బాలమురళి దర్శన్, ఎం. గురు వికాశ్, నాలుగోవ స్థానంలో శ్రీ వేంకటేశ్వర మెడికల్ కళాశాల, తిరుపతి ఆలుగంటి మోనిక, దొమ్మలపాటి దేవేని లక్ష్మి వెంగమ్మ, బాలాజీ లు పోటీలలో గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు డా. శరణ్ బి సింగ్, డా. ఉమ మహేశ్వర రావు, డా. శర్వాణి, డా చంద్రశేఖర్ చేతుల మీదుగా సర్టిఫికేట్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫిజియాలజీ ప్రొఫెసర్ డా. శర్వాణి, డా. శ్రీకాంత్, డా. హిమజ, డా. సునీత, డా. మౌనిక విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సిఎం చంద్రబాబు విజన్‌కు ఇదో నిదర్శనం

### –లబ్ధిదారుల మాటామంతీ



తిరుపతి,జూన్ 12ప్రభాతవార్త:

రెండేళ్ళ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం పాలనలో జరిగిన సంక్షేమం, అభవృద్ధి సదస్సులో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా తాను పొందిన లబ్ధిని,తన అనుభవాన్ని ఉష ఈ సందర్భంగా వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో తనకు కలిగిన మేలును చంద్రబాబు అనే రైతు చెప్పారు. తన ఐదుగురు పిల్లలకు తల్లికి వందనం నిధులు తన ఖాతాలో జమ అయ్యాయని,చక్కగా చదువుకుంటున్నారని తల్లికి వందనం లబ్ధిదారు పులిచర్ల నాగమ్మ సంతోషంగా చెప్పారు. తనకు కూటమి ప్రభుత్వం ఇల్లు ఇచ్చిందని నాగమ్మ సభా వేదికగా వెల్లడించింది.

## తిరుపతి ఆలయాల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్

తిరుపతి, జూన్ 12ప్రభాతవార్త:



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ శుక్రవారం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని,కపిలేశ్వరుని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు, ఆలయ అధికారులు దర్శనానంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.కపిలేశ్వర ఆలయంలో ఆలయ అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు

## ఎన్‌డిఎ బహిరంగ సభకు బిజెపి శ్రేణులు




తిరుపతి, జూన్ 12ప్రభాతవార్త:

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ రెండేళ్ల పరిపాలనలో అభివృద్ధి సంక్షేమ పై తిరుపతి దామినేడు సమీపంలో జరుగుతున్న భారీ బహిరంగ సభకు బిజెపి నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు .జిల్లా పార్టీ అధ్యక్షుడుసామంచి శ్రీనివాస్, మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వందలాదిమంది బిజెపి నాయకులు కార్యకర్తలు తిరుచానూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ర్యాలీగా సభకు తరలి వెళ్లారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో అనేక మార్పులు తీసుకువచ్చిందని కొనియాడారు ముఖ్యంగా ప్రజా సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి ముందుకు వెళుతున్నదని పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో మరో 15 ఏళ్లపాటు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

## మురుగునీటి సమస్యకు తాత్కాలిక పరిష్కారం

వరదయ్యపాలెం, జూన్ 12, ప్రభాతవార్త:



కదూరు గ్రామంలోని హరిజనవాడలో మురుగునీటి పారుదల సమస్య మరోసారి తీవ్రరూపం దాల్చింది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రహదారులపైకి చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడటమే కాకుండా, దుర్వాసన మరియు దోమల వ్యాప్తి పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రతను గుర్తించిన పంచాయతీ అధికారులు తాత్కాలిక చర్యగా జేసీబీ సహాయంతో కాలువ తవ్వించి మురుగునీరు వెళ్లేలా ఏర్పాట్లు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనులను గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం, వర్షాకాలం మరియు ఇతర సందర్భాల్లో ఈ సమస్య తరచూ పునరావృతమవుతోంది. ప్రతి సారి తాత్కాలిక చర్యలకే పరిమితమవుతున్న అధికారులు, శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. హరిజనవాడలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## సిబ్బంది సంక్షేమం పై ప్రత్యేక దృష్టి బెటాలియన్స్ ఐజి బి రాజకుమారి




వెంకటగిరి, జూన్ 12, ప్రభాతవార్త

బెటాలిసి సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు బెటాలియన్స్ ఐజి బి రాజకుమారి తెలిపారు. బెటాలియన్‌లో పెరేడ్ గ్రౌండ్లో నూతనంగా నిర్మించిన పోర్టు గోడను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెటాలియన్ సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కూడా లెక్కచేయరని తెలిపారు. సిబ్బంది సంక్షేమంపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూస్తున్నట్లు చెప్పారు. సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. బెటాలియన్ లో సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. బెటాలియంలో రికార్డులను పరిశీలించారు.కమాండెంట్ ఈఎస్ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

## విజయత్సోవ సభకు మహిళల ర్యాలీ



తిరుపతి, జూన్ 12 ప్రభాతవార్త:

తిరుపతి రూరల్ దామినేడు వద్ద జరిగిన రెండేళ్ళ విజయోత్సవ సభకు మొట్టమొదటి సారిగా దాదాపుగా 300మహిళలు నారా చంద్రబాబు నాయుడు సభకు స్వచ్ఛందంగా స్కూటర్ ర్యాలీ గా బయలుదేరారు. బైపాస్ రోడ్డున ఈ ర్యాలీ నిర్వహించారు. తిరుపతి లో తెలుగుదేశం పార్టీ లో ఇదే మొదటి సారి 25 వార్డు మాజీ కార్పొరేటర్ నరసింహా ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు.